మల్లన్న ఆలయంలో భక్తజన హోరు

- స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం
- కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం

7లో



జాతీయ పతాకాన్ని ఎగురవేసి వందనం చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి



పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ఉద్యమ స్ఫూర్తితో.. ప్రగతి పథంలో

- జిల్లాను అగ్రస్థానంలోనే నిలిపేందుకు అధికార యంత్రాంగం కృషి చేయాలి
- రాష్ట్ర సాధన పోరాటంలో ప్రధాన భూమిక పోషించిన సిద్దిపేట
- సాంస్కృతిక సాహిత్య చైతన్యం ఉన్నప్రాంతమిది
- కలెక్టర్ మను చౌదరి



మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 2 : ఉద్యమ స్ఫూర్తితో జిల్లాను అన్ని రంగాల్లో ప్రగతి పథంలో తీసుకెళదామని కలెక్టర్ మనుచౌదరి పిలుపునిచ్చారు. జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఆదివారం తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ మనుచౌదరి తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాలవేసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. పోలీసుల గౌరవ వందనం స్వీకరించి ప్రభుత్వ పాఠశాల విద్యార్థినులకు డిక్షనరీలు, నోట్‌బుక్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మనుచౌదరి ప్రసంగిస్తూ.. రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు పూర్తయి 11 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా తెలంగాణ అమరవీరుల కుటుంబాలకు, ఉద్యమకారులకు, జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయిలో తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని తెలంగాణ ఉద్యమ తొలి, మలిదశ అమరవీరులకు నివాళులర్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఎందరో అమరవీరుల ప్రాణ త్యాగాల పునాదులపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని గుర్తుచేశారు. అన్ని రంగాల్లో దశ దిశలా వెలుగులను విరజిమ్ముతు దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తెలంగాణ ఒక భౌగోళిక స్వరూపం మాత్రమే కాదని, అస్తిత్వ పోరాటానికి రూపమన్నారు. తెలంగాణ ఒక ప్రత్యేక సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయాలను కలిగి ఉండి తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ భాషలను మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు మేధావులు, అన్ని వర్గాల ప్రజలు సుదీర్ఘ పోరాటం చేయగా, వందలాది మంది విద్యార్థులు, యువకుల బలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఆకాంక్ష సాకారమైందన్నారు. నేడు స్వేచ్ఛ తెలంగాణలో జీవిస్తున్నామని చెప్పారు. ఈ వేడుకలలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, సీపీ అనురాధ, అదనపు కలెక్టర్లు గరీమ అగ్రవాల్, శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఏర్పాటులో జిల్లా కీలక పాత్ర

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో సిద్దిపేట జిల్లా ప్రజల ప్రధాన భూమిక పోషించారని గర్వంగా చెబుతున్నానని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. అనాదిగా సిద్దిపేట ప్రాంతం కవులకు, మేధావులకు నిలయమని విలుసిల్లుతుందని ఆయన గుర్తుచేశారు. జిల్లా సాంస్కృతిక సాహిత్య చైతన్యం ఉన్న ప్రాంతమన్నారు. ఆ ప్రభావంతో సిద్దిపేట ప్రజలు తొలి దశ, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో పాలుపంచుకున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో జిల్లాలో ప్రజలు ముందు వరుసలో నిలిచారన్నారు. ఉద్యమానికి నాయకత్వం వహించిన నాయకుల పోరాటపటిమను గుర్తుచేశారు. వర్షాకాలంలో వానలు బాగా కురిసి జిల్లాలో పంటలు బాగా పండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు, ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ జరగకుండా అధికార యంత్రంగా బాగా చేసిందని ఆయన ప్రశంసించారు.

వ్యవసాయ శాఖలో గందరగోళం

- ఇంతవరకు డీఏవోను నియమించని అధికారులు
- శాఖలో కొరవడిని సమన్వయం
- ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న అగ్రికల్చర్ ఆఫీసర్లు

సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 2 : వ్యవసాయ శాఖలో గందరగోళం నెలకొన్నది. జిల్లా వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న శివప్రసాద్ సస్పెండ్ అయిన విషయం తెలిసింది. అయితే, ఆయన స్థానంలో మరొకరిని వెంటనే నియమించాల్సి ఉండగా జాప్యం జరుగుతోంది. ఇదే అదునుగా వ్యవసాయ శాఖలో అధికారులంతా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. కొందరు కనీసం తమ మండలాలకు వెళ్లడం లేదని తెలుస్తోంది. కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్న వ్యవసాయ శాఖ కార్యాలయానికి ఒకరిద్దరు తప్ప మిగతా వారు రావడం లేదు.

ఓవైపు రైతులు తమ వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు. వర్షం పడగానే విత్తనాలు వేసేందుకు ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా జిల్లాలో జీలుగు విత్తనాలు కొరత వేధిస్తుంది. డీఏవో లేకపోవడం కారణంగా నకిలీ విత్తనాలపైన టాస్క్‌ఫోర్స్ తనిఖీలు రికార్డులను చెక్ చేయడానికే పరిమితమైంది. ఇటీవల కలెక్టర్ వ్యవసాయ శాఖకు సంబంధించిన అంశాలపైన సమావేశం నిర్వహిస్తే ఆ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి లేకపోవడం గమనార్హం.

డీఏవో పోస్ట్‌కు పైరవీ చేస్తున్న ఓ అధికారి ?

డీఏవో సస్పెండ్ అయిన వెంటనే మరొకరికి ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించాల్సి ఉంది. లేదా మరో అధికారిని వెంటనే నియమించాలి. ఆరు రోజులైనా దీనిపై ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. అయితే, డీఏవో పోస్ట్‌కు జిల్లాకు చెందిన ఏడీఏ స్థాయిలో ఉన్న ఓ అధికారి తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఈ పోస్ట్ కోసం అధికార పార్టీ పెద్దల చుట్టూ తిరిగి కమిషనర్‌కు ఫోన్లు చేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వ్యవసాయ అధికారుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి. డీఏవో సస్పెన్షన్‌లోనూ ఈ అధికారే కీలకం వ్యవహరించినట్లు సమాచారం. ఈ శాఖలో ఉన్న అధికారులంతా సంఘటితమై డీఏవో శివప్రసాద్ సస్పెన్షన్ ఎత్తివేయాలని వ్యవసాయ శాఖ మంత్రిని, రాష్ట్ర వ్యవసాయ కార్యదర్శిని కలిసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే, ఇప్పటివరకు డీఏవోను నియమించకపోవడం అనేక అనుమానాలకు దారితీస్తుంది. మరో పది రోజుల్లో రైతులంతా వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. సన్నవరి సాగు చేస్తే ఎకరాకు రూ.500 బోనస్, రైతు భరోసా, రైతు రుణాలపై వ్యవసాయ అధికారులే బాధ్యత తీసుకోవాలి. ఇదంతా జిల్లా వ్యవసాయ అధికారి నేతృత్వంలో అమలు చేయాల్సి ఉంటుంది. డీఏవోను నియమించకపోవడంతో వ్యవసాయ శాఖలో సమన్వయం లోపించి ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు.

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వాన

- ఉమ్మడి మెదక్ జిల్లాలో విభిన్న వాతావరణం
- బెజ్జంకిలో 44.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- అక్కన్నపేట మండలం కట్కూర్‌లో 7.8 సెంటీమీటర్ల వర్షపాతం

7లో

పోలీస్ పహారా

- భద్రతా వలయంలో కౌంటింగ్ కేంద్రాలు
- బీవీఆర్ఐటీ, గిరిజన గురుకులం చుట్టూ బందోబస్తు
- పాస్‌లున్న వారికే అనుమతి
- వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు



గిరిజన గురుకులం లోనికి వెళ్లేదారిలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్

నర్సాపూర్, జూన్ 2 : మెదక్ లోక్‌సభ కౌంటింగ్ కేంద్రాలైన నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ కళాశాల, గిరిజన గురుకుల పాఠశాల పోలీస్ భద్రతా వలయంలోకి వెళ్లాయి. స్ట్రాంగ్‌రూముల వద్ద మూడంచెల భద్రతతో పాటు పోలీసు బలగాలు మోహరించి పహారా కాస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో చివరి ఘట్టమైన ఓట్ల లెక్కింపు కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు జిల్లా అధికార యంత్రాంగంతో పాటు పోలీసు యంత్రాంగం కూడా అన్ని ఏర్పాట్లు చేశాయి.

నిఘా నీడలో లెక్కింపు

రేపు నిర్వహించనున్న కౌంటింగ్‌ను కట్టుదిట్టమైన భద్రత మధ్య ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా సజావుగా నిర్వహించేందుకు పోలీస్ యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరిస్తున్నది. కౌంటింగ్‌ను భారీ బందోబస్తు మధ్య నిఘా నీడలో నిర్వహించనున్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల సంబంధించిన ఈవీఎంలు అసెంబ్లీ సెగ్మెంట్ వారీగా రెండుచోట్ల భద్రపరిచారు. భద్రపరిచిన చోటనే కౌంటింగ్ కూడా ర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. నర్సాపూర్-సంగారెడ్డి ప్రధాన రోడ్డులో ఉన్న బీవీఆర్ఐటీ కళాశాలలో సిద్దిపేట, గజ్వేల్, దుబ్బాక, మెదక్, నర్సాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ఓట్లను లెక్కించనుండగా పటాన్‌చెరు, సంగారెడ్డి నియోజకవర్గాల ఓట్లను నర్సాపూర్-మెదక్ ప్రధాన రోడ్డులో ఉన్న గిరిజన గురుకులంలో నిర్వహించనున్నారు. ఈ రెండు చోట్ల కూడా ఆయా విద్యాసంస్థలను పోలీసులు తమ ఆధీనంలో తీసుకుని లోనికి ఎవరిని అనుమతించడం లేదు. ఎవరైనా లోనికి వెళ్లాలంటే సంబంధిత ఉన్నతాధికారుల అనుమతి ఉంటే తప్ప పంపించడం లేదు.



బీవీఆర్ఐటీ కళాశాల మైదానంలో జర్నలిస్టుల కోసం ఏర్పాటు చేస్తున్న షామియానాలు

650 మంది పోలీసులతో బందోబస్తు

ప్రస్తుతం స్ట్రాంగ్‌రూములలో మూడంచెల భద్రత మధ్య ఈవీఎంలు ఉండగా కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి చిన్న ఘటన కూడా జరగకుండా ఉండేందుకు అదనపు బలగాలతో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. కౌంటింగ్ రోజు బందోబస్తుకు 650 మంది పోలీసు సిబ్బందిని వినియోగించనున్నారు. ఎస్పీ నేతృత్వంలో పది మంది డీఎస్పీలు, 15 మంది ఇన్‌స్పెక్టర్లు, 30 మంది ఎస్ఐలు బందోబస్తులో పాల్గొననున్నారు. బందోబస్తు కోసం పోలీసులు సోమవారం కౌంటింగ్ కేంద్రాలకు చేరుకుంటారని అధికారులు తెలిపారు.

బీవీఆర్ఐటీలో ఐదు బ్లాకులలో కౌంటింగ్

కౌంటింగ్‌ను కూడా స్ట్రాంగ్‌రూములు ఉన్న బ్లాకులలోనే నిర్వహించనున్నారు. బీవీఆర్ఐటీలోని ఐదు బ్లాకులలో ఐదు సెగ్మెంట్ల ఈవీఎంలను భద్రపరచగా ఈ బ్లాక్‌లలోని కౌంటింగ్‌కు సిద్ధం చేశారు. టేబుళ్లు, ఫెన్సింగ్ ఏర్పాట్లను చేశారు. గిరిజన గురుకులంలోని రెండు అసెంబ్లీ సెగ్మెంట్ల ఈవీఎంలు ఉన్న స్ట్రాంగురూముల గది పక్కనే కౌంటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే, గుర్తింపు కార్డు ఉన్న వారికే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

సమీపంలో పార్కింగ్

కౌంటింగ్‌కు ఆయా అభ్యర్థుల ఏజెంట్లు, సిబ్బంది, అధికారులు, పోలీసులతో పాటు ఇతరులు కూడా పెద్దసంఖ్యలో వచ్చే అవకాశముంది. వీరందరి వాహనాల పార్కింగ్ కోసం పోలీసులు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. బీవీఆర్ఐటీ వద్ద కాలేజీకి 500 మీటర్ల దూరంలో ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలు పార్కింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. కౌంటింగ్ కేంద్రాల సమీపంలో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

ఏజెంట్లకు ప్రత్యేక ఏర్పాటు

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కౌంటింగ్ నిర్వహించనున్నందున కౌంటింగ్ కేంద్రాలలో అభ్యర్థుల తరపున హాజరయ్యే ఏజెంట్లకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కౌంటింగ్ కేంద్రాలకు ఎన్నికల అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం ఉన్న ఏజెంట్లను మాత్రమే అనుమతించనున్నారు. సెల్‌ఫోన్‌తో పాటు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను లోనికి తీసుకెళ్లకుండా ఆంక్షలు విధించారు. ఇక కౌంటింగ్ హాల్‌లోనూ ఈవీఎంలు ఉన్న చోటకు వెళ్లకుండా చుట్టూ జాలిని ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్ బయటనే కుర్చీలలో కూర్చుని కౌంటింగ్ ప్రక్రియ చూడాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

మెదక్, జూన్ 2: మెదక్ లోక్‌సభ నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఎన్నికల కౌంటింగ్‌కు అవసరమైన సిబ్బంది రెండో ర్యాండమైజేషన్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకులు, కౌంటింగ్ అబ్జర్వర్ల సమక్షంలో పూర్తిచేసినట్లు తెలిపారు. మూడో ర్యాండమైజేషన్ మంగళవారం ఉదయం 5 గంటలకు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపునకు అసెంబ్లీ సెగ్మెంట్లవారీగా.. మెదక్ 14 టేబుళ్ల ఏర్పాటు చేసి 20 రౌండ్లలో లెక్కించనున్నామని తెలిపారు. నర్సాపూర్-14 టేబుళ్లు, 20 రౌండ్లు, సిద్దిపేట-14 టేబుళ్లు, 20 రౌండ్లు, దుబ్బాక-14 టేబుళ్లు, 19 రౌండ్లు, గజ్వేల్-15 టేబుళ్లు, 22 రౌండ్లు, పటాన్‌చెరు-18 టేబుళ్లు, 23 రౌండ్లు, సంగారెడ్డి-14 టేబుళ్లు, 21 రౌండ్లు, పోస్టల్‌బ్యాలెట్లు-18 టేబుళ్లు, 2 రౌండ్ల చొప్పున... మొత్తం 103 టేబుళ్లపై ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

ఉత్తమ పోలీసులకు సేవా పతకాలు

మెదక్ అర్బన్, జూన్ 2: విధి నిర్వహణలో ప్రతిభను కనబరిచిన పోలీసు అధికారులకు రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రత్యేక సేవా పతకాలను ప్రకటించింది. మెదక్ జిల్లా నుంచి వివిధ విభాగాల్లో ఏడుగురు పోలీసు అధికారులు, కానిస్టేబుళ్లకు పతకాలు లభించాయి. జిల్లా ప్రధాన పోలీసు కార్యాలయంలో జరిగిన ఆవిర్భావ వేడుకల్లో ఎస్పీ చేతుల మీదుగా సేవా పతకాలను అందుకున్నారు. అవార్డులు పొందిన వారిలో డీఎస్పీ సైదులు(మెదక్), ఎస్‌ఐగౌస్(కొల్చారం), ఏఎస్‌ఐ మల్లప్ప(తూప్రాన్), హెడ్ కానిస్టేబుల్ రవీందర్(అల్లాదుర్గం), ఏఆర్ఎస్ఐ అశోక్(హెడ్ క్వాటర్), ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ షాహెద్ ఆలీ(హెడ్ క్వాటర్), ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్ ఫసియొద్దిన్ (హెడ్ క్వాటర్) ఉన్నారు.



మెదక్ ఎస్పీ బాలస్వామి చేతుల మీదుగా ఉత్తమ సేవా పతకం అందుకుంటున్న డీఎస్పీ సైదులు

తపాస్‌పల్లిలో 'సోషల్ పంచాయితీ'

● గ్రామసమస్యలపై సోషల్‌మీడియాలో యువకుల పోస్టులు

● మూడు నెలలుగా వేధిస్తున్నారని పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు



సమస్యలపై చేసిన పోస్టులను చూపుతున్న యువకులు

చేర్యాల, జూన్ 2: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి గ్రామంలో నెలకొన్న సమస్యల పట్ల గ్రామానికి చెందిన పలువురు యువకులు సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారు. సదరు యువకులు మూడు నెలలుగా వేధిస్తున్నారంటూ గ్రామపంచాయతీ కార్యదర్శి ఇటీవల కొమురవెల్లి పోలీ‌స్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తపాస్‌పల్లి గ్రామం కొమురవెల్లి మండల సరిహద్దులో ఎత్తైన ప్రదేశంలో ఉంటుంది. గ్రామంలో తాగునీటి సమస్య నెలకొనడంతో పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు యువకులు సోషల్‌మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. బోర్లు పాడైపోయినా త్వరితగతిన మరమ్మతులు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతుందని ప్రస్తావించారు. అయితే తమకెలాంటి సంబంధంలేని విషయాలను ప్రస్తావిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని యువకులపై కొమురవెల్లి పోలీసులకు మూడు రోజుల క్రితం పంచాయతీ కార్యదర్శి పంచాక్షరి ఫిర్యాదు చేశారు. గ్రామపంచాయతీకి సంబంధంలేని విషయాలకు తనకు ఆపాదిస్తూ వాట్సప్ గ్రూపుల్లో పోస్టులు చేస్తూ అవమానిస్తున్నారని, మూడు నెలలుగా వేధింపులకు పాల్పడుతున్నారని వాపోయారు. సమస్యలను పరిష్కరించకుండా తమపై తప్పుడు ఫిర్యాదు చేసిందని యువకులు పేర్కొంటూ.. వారు సైతం అదే రోజు పంచాయతీ కార్యదర్శిపైన ఫిర్యాదు చేశారు.



శివ్వంపేటలో షాపుపై విరిగిపడిన వేప చెట్టు



శివ్వంపేట మండలం గూడూరులో కారుపై విరిగిపడిన వృక్షం



హుస్నాబాద్ పట్టణంలో జలమయమైన రోడ్డు

మధ్యాహ్నం ఎండ.. సాయంత్రం వాన

● ఉమ్మడి మెదక్ జిల్లాలో విభిన్న వాతావరణం

● బెజ్జంకిలో 44.2 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు

● కట్యూర్‌లో 7.8 సెంటీ మీటర్ల వర్షపాతం

మెదక్ అర్బన్, జూన్ 2: ఉమ్మడి మెదక్ జిల్లాలో విభిన్న వాతావరణం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. ఆదివారం సాయంత్రం ఐదింటి దాకా భానుడు భగభగతో ఉక్కిరిబిక్కిరి చేయగా.. సాయంత్రం ఒక్కసారిగి భారీ వర్షం కురిసింది. పగటి ఉష్ణోగ్రత 44.2 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. వాతావరణం ఒక్కసారిగా చల్లబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచాయి. ఉరుములు, మెరుపులతో వానలు కురిశాయి. ఆదివారం అత్యధికంగా సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో 44.2 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా.. మెదక్ జిల్లా డి.ధర్మారంలో 43.4, సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో 42.9 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. సిద్దిపేట జిల్లాలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. అత్యధికంగా కట్యూర్‌లో 7.8 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా నంగునూరులో 6.2 సెం.మీ., సముద్రాలలో 6.05 సెం.మీ., గండిపల్లిలో 3.6 సెం.మీ., హుస్నాబాద్‌లో 3.5 సెంటీ మీటర్ల వర్షం కురిసింది. మెదక్ జిల్లాలో పలు చోట్ల భారీ వర్షం పడింది. జిల్లాలో కేంద్రంలో దాదాపు అరగంట పాటు వర్షం కురిసింది. ఈదురు గాలులకు గంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మెదక్ జిల్లా కొల్చారంలో 4.9 సెం.మీ., మిన్పూర్‌లో 4.5 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. సంగారెడ్డి జిల్లాలో ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది. రానున్న మూడు రోజుల పాటు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు.

ఈదురు గాలులకు విరిగిపడ్డ భారీ వృక్షాలు

శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేట మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. గాలి, ఉరుములు, మెరుపులతో కురిసిన అకాల వర్షానికి మండల పరిధిలోని గూడూరు గ్రామంలో దర్గా వద్ద వంద సంవత్సరాల నాటి భారీ రాగి వృక్షం విరిగి పార్కింగ్ చేసిన కారు పైన పడింది. కారు పూర్తిగా ధ్వంసంకాగా, ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్టును తొలగించారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో వేపచెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయింది. అదేవిధంగా సబ్ స్టేషన్‌లో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. అలాగే టవర్ విరిగిపడడంతో సుమారు రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. పలు గ్రామాల్లో విద్యుత్ వైర్లపై చెట్లు విరిగిపడ్డాయని ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు.

జలమయమైన రహదారులు

హుస్నాబాద్/అక్కన్నపేట: హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో జోరుగా వర్షం కురిసింది. గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో హుస్నాబాద్ పట్టణంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వారం రోజులుగా తీవ్రమైన ఎండలతో ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డ ప్రజలు ఈ వర్షంతో వాతావరణం చల్లబడిందని పేర్కొంటున్నారు. హుస్నాబాద్ పట్టణంలో జరుగుతున్న ఎల్లమ్మ జాతరలో వర్షం కారణంగా నీరు నిలిచిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోహిణి కార్తె ప్రారంభం అవడం, తొలకరి వర్షం కురవడంతో హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

వానాకాలం కరెంటుతో జాగ్రత్త

● విద్యుత్ పనులకు రైతులు దూరంగా ఉండాలి



కొల్చారం, జూన్ 2: వానాకాలంలో కరెంటు పనులకు రైతులు దూరంగా ఉండడమే మేలని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ సరఫరాలో ఏదైనా సమస్య ఏర్పడితే స్వీయ మరమ్మతులకు పూనుకోకుండా ఆ శాఖ అధికారులకు సమాచారమిచ్చి, సమస్యను పరిష్కరించుకోవడమే ఉత్తమమని పేర్కొంటున్నారు. రుతుపవనాలు వచ్చే సమయంలో భీకర ఈదురు గాలులు, వర్షాలతో విద్యుతు తీగలు తెగి, బోర్‌మోటార్‌కు తగిలే అవకాశం ఉంటుంది. ఆ సమయంలో అన్నదాతలు అప్రమత్తంగా ఉండాలి. చిన్న సమస్యే కదా అని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద సొంతంగా మరమ్మతులు చేయొద్దని అధికారులు సూచిస్తున్నారు. సమస్య ఉంటే తమ సిబ్బందికి తెలియజేయాలంటున్నారు.

మోటారు ఆన్ చేసేప్పుడు అప్రమత్తత అవసరం

బోర్ మోటార్లు ఆన్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలి. ఈదురుగాలులకు కొన్నిసార్లు తీగలు తెగిపోతుంటాయి. అన్ని తీగలు, ఫ్యూజ్‌లను తరచూ పరిశీలించిన తర్వాతే మోటారును ఆన్ చేయాలి. వర్షం పడుతున్నప్పుడు బోర్ వేయకపోవడం ఉత్తమం. బోర్‌బావుల్లో కంపెనీ మోటార్లే వాడాలి. వారు నిబంధనల ప్రకారం పరికరాలను తయారు చేసినందునా కాలిపోయినా విద్యుత్ సరఫరా కాదు. అవి కాలిన సందర్భాల్లో పైపుల వరకు విద్యుత్ సరఫరా అవుతుంటుంది. అలాంటి సమయంలో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.

ఇనుప డబ్బాలతో ప్రమాదం

మూతల్లేని స్టార్టర్లు, ఇనుప డబ్బాలతో ప్రమాదం పొంచి ఉంటుంది. మూతలు లేకపోతే వానలకు లోపలి భాగం తడిసిపోతుంది. ఆ సమయంలో మరమ్మతులకు ప్రయత్నిస్తే నష్టం జరగొచ్చు. తీగలు కాలి ఇనుప డబ్బాలకు తగిలితే ప్రాణాంతకమవుతుంది. డబ్బా దగ్గరకు వెళ్లినప్పుడు కాళ్లకు చెప్పులు, చేతి తొడుగులు ధరించాలి. నాణ్యమైన ప్లాస్టిక్ డబ్బాలు అందుబాటులోకి వచ్చినందున వాటిని వాడుకోవడం మంచిది.

విద్యుత్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలి

పొలాల్లో వదులు తీగలు గమనించినా, స్తంభాలపై మరమ్మతులు చేయాల్సి వచ్చినా విద్యుత్తు శాఖ అధికారులకు, సిబ్బందికి మౌఖికంగా లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలి. నిర్ణీత గడువులోపు సరిచేయకుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించుకోవాలి. రైతులే సొంతంగా మరమ్మతులు చేయడం మంచిది కాదు.

సమస్యలు ఉంటే మా దృష్టికి తేవాలి



వానకాలం వస్తుండగానే రైతులు పంట చేల్లో కరెంటు మోటార్లు మరమ్మతులు చేస్తుంటారు. పంటపొలాల్లో విద్యుత్ స్తంభాలు, వైర్లు వేలాడుతుంటే మా సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. రైతులే సొంతంగా ఎలాంటి మరమ్మతులు చేపట్టరాదు. ప్రమాదాలను కొని తెచ్చుకోరాదు.

- హైమద్ అలీ, విద్యుత్ సహాయ ఇంజనీర్, కొల్చారం

జీలుగ సాగుకు రైతుల ఆసక్తి

● బోనస్ ప్రకటనతో సన్నాలపై దృష్టి

● సన్నాలు బాగా పండాలంటే పచ్చిరొట్టయే ప్రధానం

● విత్తనాల కోసం మెదక్ జిల్లా రైతుల ఎదురుచూపు

మెదక్, జూన్ 2: పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకంతో కలిగే దుష్పలితాలపై వ్యవసాయాధికారులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయడంతో రైతులు భూసారం పెంపొందించడానికి జీలుగ విత్తనాలు వేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రధానంగా సన్నరకం వడ్లపై ప్రభుత్వం రూ.500 బోనస్ ఇవ్వనున్నట్లు ప్రకటించడంతో రైతులు దొడ్డురకానికి బదులుగా సన్నాలు వేయడానికి సిద్ధమవుతున్నారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు నేల తడవడంతో రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. వరినాట్లకు నెల రోజుల ముందే పచ్చిరొట్ట ఎరువు సమకూర్చుకోవాలి. అయితే మెదక్ జిల్లాలో పచ్చిరొట్టతో పాటు ఎరువులు, విత్తనాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. పలు చోట్ల రోడ్డెక్కి ఆందోళనలు చేస్తున్నారు. డిమాండుకు సరిపడా జీలుగ అందివ్వడంలో జిల్లా వ్యవసాయాధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి.



రామాయంపేటలో జీలుగ విత్తనాలు విక్రయిస్తున్న డీలర్ (ఫైల్)

ఖరీఫ్ సీజన్‌లో 3,73,509 ఎకరాల్లో సాగు

ఈ వానాకాలం సీజన్‌లో మెదక్ జిల్లాలో 3,73,509 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇందులో 3,27,113 ఎకరాల్లో వరి పంట వేయనున్నారు. ఇందులో 80 శాతం దొడ్డురకం వరిపంటే సాగు చేస్తారని అధికారులు ముందుగా అంచనా వేశారు. ప్రభుత్వ బోనస్ ప్రకటనతో రైతులు తమ ప్రణాళిక మార్చుకుని సన్నాలవైపు మొగ్గు చూపారు. ప్రస్తుతం జిల్లాలో 50 శాతం సన్నరకం వరి సాగయ్యే అవకాశముందని భావిస్తున్నారు. ఇందుకోసం సంప్రదాయక ఎరువులపైనే రైతులు దృష్టి పెట్టారు. నిస్సారమైన నేలలున్న చోట పచ్చిరొట్ట ఎరువులు వేస్తే ఫలితముంటుందని, భూసారం అధికంగా ఉంటేనే సన్నరకం పంట దిగుబడులు బాగా వస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వరి నాటేసే ముందు జీలుగ, జనుము, పిల్లి పెసర వంటి పచ్చిరొట్ట సాగు చేసేందుకు రైతులు ఆసక్తిని కనబరుస్తున్నారు.

6,400 క్వింటాళ్ల పచ్చిరొట్ట సరిపోయేనా?

జిల్లా వ్యాప్తంగా 3లక్షల 73 వేల ఎకరాల పంటలకు ఇప్పటి వరకు 4,462 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలు మాత్రమే రైతులకు పంపిణీ చేశారు. 1,938 క్వింటాళ్లకు ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుత డిమాండ్ ప్రకారం ఇవి సరిపోవని భావిస్తున్నారు. సన్నరకం వరికి మొగ్గు చూపుతున్న నేపథ్యంలో మరో 5 వేల క్వింటాళ్లు అవసరం అవుతాయని రైతులు అభిప్రాయపడుతున్నారు. అయితే రైతులందరూ సంప్రదాయక ఎరువులను వినియోగించరనే అభిప్రాయాన్ని వ్యవసాయాధికారులు వ్యక్తం చేస్తున్నారు. అందుకనే పంటల ప్రణాళికలో పచ్చిరొట్ట ప్రాధాన్యతను తగ్గించారు. గత రెండేళ్లుగా సంప్రదాయ ఎరువుల వాడకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన పెంపొందించడం ఒక ఎత్తైతే, సన్నరకం వరి సాగు రెట్టింపవ్వడం తదితర కారణాలతో పచ్చిరొట్ట వేయడంపై ఆసక్తి కనబరుస్తున్నారు.

జీలుగ విత్తనాల కొరత లేదు

మెదక్ జిల్లాలో జీలుగ విత్తనాల కొరత లేదు. ఈ సీజన్‌కు సరిపడా పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు పంపిణీ చేస్తాం. దొడ్డురకం వరిపంట సాగుకు జీలుగు విత్తనాలు ఏ మేరకు అవసరం పడతాయో ప్రణాళిక‌ను రూపొందించుకున్నాం. సుమారు 6వేల క్వింటాళ్ల విత్తనాలు సరిపోవాలి. కానీ జిల్లాలో సన్నరకం వరి సాగు పట్ల రైతులు ఆసక్తి చూపుతుండడంతో పచ్చిరొట్ట విత్తనాల అవసరం పెరిగింది. దుక్కులు దున్నడానికి ఇంకా పదిహేను రోజులు సమయం ఉన్నందున విత్తనాలను సమకూర్చుతాం. రైతులు ఆందోళన చెందవద్దు.

- గోవింద్, జిల్లా వ్యవసాయాధికారి, మెదక్

మండి బిర్యానీ వికటించి ఆరుగురికి తీవ్ర అస్వస్థత

● కేసు నమోదు చేసిన పోలీసులు

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 2: మండి బిర్యాని తిని ఐదుగురికి తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ ఎస్.సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా నర్సాపూర్‌కు చెందిన మధ్యటి ఉషారాణి మరో 8మంది బంధువులతో కలిసి మే 31న యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరిలోని సువర్ణగిరి ఆలయానికి వెళ్లారు. దర్శనం పూర్తి అయ్యాక రాత్రి 10 గంటలకు కారులో ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ఘట్‌కేసర్‌లో భోజనం కోసం అరేబియన్ మండిలో బిర్యాని తినడానికి వెళ్లారు. తొమ్మిది మందిలో ఉషారాణి, చందు, మహేష్, రేణుక, అశోక్, మౌనిక మండిలో బిర్యాని తినగా, మిగిలిన ముగ్గురు భోజనం చేయలేదు. అనంతరం నర్సాపూర్‌లోని ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికి మండి బిర్యాని తిన్న ఆరుగురు వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేరగా, కల్తీ ఆహారం తీసుకోవడం వల్లే అస్వస్థతకు గురైనట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో ఆదివారం ఉషారాణి తండ్రి కోలోజు నర్సింహ్మాచారి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కల్తీ ఆహారం విక్రయిస్తున్న అరేబియన్ మండి యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదులు తెలిపారు.


మల్లన్న ఆలయంలో భక్తజన హోరు



పట్నాలు రచించి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

● స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం

చేర్యాల, జూన్ 2: కొమురవెల్లి మల్లన్న ఆలయం ఆదివారం భక్తజనంతో హోరెత్తింది. స్వామివారి దర్శనార్థం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. మట్టికుండలో బోనంచేసి భక్తి ప్రపత్తులతో చలక, నజరు, ముఖమండప పట్నాలువేసి మొక్కులు తీర్చుకున్నారు. మల్లన్నను దర్శించుకుని, ఒడిబియ్యాలు పోసి వేడుకున్నారు. ఎల్లమ్మ దేవతకు బోనం నివేదించి, కల్లు, బెల్లంపానకం సాక పెట్టి ఒడి బియ్యాలు పోశారు. పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగి రేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారాయి. తమ కోరికలు నెరవేర్చమని వేడకుంటూ గంగిరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పర్యవేక్షించారు.ప్రత్యేక, ఉచిత ధర్మదర్శనం క్యూలైన్లల్లో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటన్నర సమయం పట్టింది.



స్వామివారి నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు



ఆలయ గంగిరేగుచెట్టు ప్రాంగణంలో భక్తజనసందోహం

కిటకిటలాడిన వనదుర్గా మాత ఆలయం



అమ్మవారి మూలవిరాట్

పాపన్నపేట: మెదక్ జిల్లాలోని ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా కరీంనగర్, నిజామాబాద్, జంటనగరాలు, పొరుగు రాష్ట్రాలైనా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ పరిసరాలు దుర్గమ్మ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శన అవకాశం కల్పించారు. మంజీరా నదిపాయల్లో స్నానాలు ఆచరించి, అమ్మవారిని దర్శించుకున్నారు.



ఆలయంలో అమ్మవారి దర్శనం కోసం భక్తుల క్యూ

వాడవాడలా ఘనంగా తెలంగాణ ఆవిర్భావ వేడుకలు

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు పట్టణ, గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు జాతీయ పతకాన్ని ఎగురవేసి అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. ఎందరో అమరుల త్యాగాల వల్లే ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని గుర్తు చేసుకున్నారు. పలుచోట్ల కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


సిద్దిపేట అగ్రికల్చర్: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ


సిద్దిపేట టౌన్: సీపీ కార్యాలయంలో జాతీయజెండాకు వందనం చేస్తున్న అదనపు డీసీపీ, సిబ్బంది


కొండపాక: ఐవోఎస్ కార్యాలయం ఎదుట జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ అనసూయ


గజ్వేల్: మునిసిపాలిటీ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మునిసిపల్ చైర్మన్ రాజమౌళి


దూళిమిట్ట: లింగాపూర్ జీపీ కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేస్తున్న దృశ్యం


నారాయణరావుపేట: తహసీల్దార్ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న అధికారులు, తదితరులు


సిద్దిపేట టౌన్: మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్


మిరుదొడ్డిలో తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న అధికారులు


మర్కుక్: జాతీయ జెండాకు వందనం చేస్తున్న మర్కుక్ మండల ప్రజాప్రతినిధులు, అధికారులు


సిద్దిపేట అర్బన్: అమరవీరుల స్థూపానికి నివాళులర్పిస్తున్న ఉద్యమకారులు


చేర్యాల: కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయంలో జాతీయపతాకానికి వందనం చేస్తున్న ఎంపీపీ కీర్తన


చేర్యాల: చేర్యాలలో తొలి, మలిదశ ఉద్యమకారులను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు


హుస్నాబాద్: మున్సిపల్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న చైర్‌పర్సన్ రజిత


నంగనూరు: జాతీయ జెండాకు వందనం చేస్తున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంగౌడ్


రాయపోల్: మండల పరిషత్ కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ


వర్గల్: అంబేడ్కర్ చౌరస్తా వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న కాంగ్రెస్ నాయకులు


కుకునూరుపల్లి: జాతీయ జెండాను ఎగురవేసి జైతెలంగాణ నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


తొగుట: ఎంపీడీవో కార్యాలయం ఎదుట జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ లతా నరేందర్‌రెడ్డి


మద్దూరు: ఎంపీడీవో కార్యాలయంలో జాతీయజెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ


బెజ్జంకి: ఎంపీపీ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ నిర్మల


దౌల్తాబాద్: ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ గంగాధరి సంధ్య


చిన్నకోడూరు: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


ములుగు: తహసీల్దార్ కార్యాలయం ఎదుట జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి


మిరుదొడ్డిలో సోనియాగాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బ్యాంకు సేవలను వినియోగించుకోవాలి

- వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి

వర్గల్, జూన్ 2: గ్రామీణ ప్రాంతాల రైతులు, ప్రజలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని వర్గల్ పీఏసీఎస్ చైర్మన్ ఇర్రి రామకృష్ణారెడ్డి కోరురు. వర్గల్ మండల కేంద్రంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు శాఖలో ఇంటింటికీ డీసీసీ బ్యాంకు డిపాజిట్ సేకరణ వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ప్రజలు, రైతులు బ్యాంకు ఖాతాలు తెరచినట్లయితే రూ. 2లక్షల వరకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తామన్నారు. పది సంవత్సరాలలోపు పిల్లలకు సహకార బచ్‌పన్ భరోసా డిపాజిట్ పథకం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అలాగే తక్కువ వడ్డీకి బంగారు రుణాలు ఇస్తున్నామని వెల్లడించారు. డిపాజిట్లపై ఇన్సూరెన్స్ సౌకర్యం ఉంటుందన్నారున్నారు. రైతులు, ప్రజలు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులు, ఫైనాన్స్‌లను ఆశ్రయించి నష్టపోవద్దని, సహకార బ్యాంక్‌ను ఆశ్రయించాలన్నారు. కార్యక్రమంలో వర్గల్ జడ్పీటీసీ బాలు యాదవ్, ఎంపీపీ జాలిగామ లతారమేశ్‌గౌడ్, బ్యాంకు మేనేజర్ నర్సింహారెడ్డి, సిబ్బంది యమున, పీఏసీఎస్ సీఈవో జితేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మహ్మద్ ఫారుఖ్, శ్రీకాంత్, ఫయాజ్ తదితరులు ఉన్నారు.


వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రామకృష్ణారెడ్డి

ప్రమాదాలకు నిలయంగా మూలమలుపులు

- కానరాని సూచిక బోర్డులు
- తరచూ ప్రమాదాలు

దౌల్తాబాద్, జూన్ 2: మూలమలుపులను గుర్తించే విధంగా సూచిక బోర్డులు లేకపోవడంతో, ఎక్కడ మూలమలుపులు ఉన్నాయో తెలియక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రహదారులు, గజ్వేల్ నుంచి దౌల్తాబాద్ వచ్చే శేరిపల్లి, బందారం గ్రామం వద్ద, చేగుంట నుంచి దౌల్తాబాద్‌కు వచ్చే మండల కేంద్రం సమీపంలో మైనార్టీ షాదీఖాన వద్ద, దొమ్మాట నుంచి దౌల్తాబాద్ వచ్చే లింగరాజుపల్లి ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాల వద్ద, దౌల్తాబాద్ మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తా నుంచి దొమ్మాటకు, ముబారస్‌పూర్ నుంచి గజ్వేల్‌కు వెళ్లే హైమదనగర్ చౌరస్తా వద్ద మూలమలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో పాటు రోడ్ల వెంట చెట్లు భారీగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని వావాహనదారులు సంబంధత అధికారులను కోరుతున్నారు.


దొమ్మాటలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ప్రమాదకరంగా మూలమలుపు

ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ అలవడుతుంది

- ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు



మాట్లాడుతున్న లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు

గజ్వేల్, జూన్ 2: ఎన్‌సీసీ శిక్షణతో స్వీయ క్రమశిక్షణ అలవడుతుందని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ మధుసూదన్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలో రెండోరోజు కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో ఆయన కెడెట్లను ఉద్దేశించి మాట్లాడారు. ఎన్‌సీసీ శిక్షణ శిబిరాన్ని కెడెట్లు సద్వినియోగం చేసుకోవాలని, స్వీయ క్రమశిక్షణకు, భవిష్యత్తుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎన్‌సీసీ కెడెట్లకు రోజువారీగా జరిగే శిక్షణ ప్రాధాన్యతను వివరించారు. వారితో ఎన్‌సీసీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, కెప్టెన్ ఎం.భవాని ఉన్నారు.

విద్యుదాఘాతంతో ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమైన ట్రాక్టర్

తొగుట, జూన్ 2: విద్యుదాఘాతంతో ట్రాక్టర్ దగ్ధమైన ఘటన తొగుట మండలం లింగాపూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకున్నది. గ్రామస్థులు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి మహిపాల్ కౌలుకు చేస్తున్న వ్యవసాయ పొలం వద్ద పశువుల కొట్టంలో రెండు ఎడ్లను కట్టేసి పక్కనే ట్రాక్టర్‌ను ఉంచాడు. ఆదివారం మధ్యాహ్నం పశువులకు నీటిని తాపడానికి మోటర్ స్విచ్ ఆన్ చేశాడు. విద్యుత్ వైర్ల నుంచి మంటలు వెలువడి పక్కనే ఉన్న గడ్డివాము, ట్రాక్టర్‌కు, స్ప్రింక్లర్ పైపులకు అంటుకుని దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు 5 లక్షల వరకు ఆస్తినష్టం జరిగినట్లు బాధిత రైతు మహిపాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని అతడు కోరాడు.

ఫోన్ అప్పగింత

రాయపోల్, జూన్ 2: పోగొట్టుకున్న ఫోన్‌ను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి బాధితుడికి అప్పగించారు. నెల రోజుల క్రితం కొత్తపల్లికి చెందిన కిచ్చిగారి అశోక్ రాయపోల్‌కు వస్తుండగా మార్గమధ్యలో తన సెల్‌ఫోన్ పడిపోయింది. ఇది గమనించకుండానే అతడు రాయపోల్‌కు వచ్చాడు. దీంతో అతడు రాయపోల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఫోన్ గుర్తించారు. ఆదివారం ఫిర్యాదుదారునికి ఎస్‌ఐ రఘుపతి అందజేశారు.



ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ రఘుపతి

విద్యార్థినికి సన్మానం


ప్రణీతను సన్మానిస్తున్న ఎంపీపీ కృష్ణారెడ్డి

మద్దూరు, జూన్ 2: మండల కేంద్రానికి చెందిన బొప్పె ప్రణీత ఆదర్శ పాఠశాలలో చదువుతున్నది. ఆమె పదోతరగతిలో 10/10 జీపీఏ సాధించడంతో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి శాలువతో కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడారు. పట్టుదలతో ఉన్నత లక్ష్యం కోసం కష్టపడి చదువాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామ్మోహన్, సొసైటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీలు బొప్పె నాగమ్మ, సమ్మయ్య కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ ముదస్సీర్, సెక్రటరీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

'లింగారెడ్డి సేవలు చిరస్మరణీయం'

కోహెడ, జూన్ 2: ప్రజల కోసం తడిసిన లింగారెడ్డి పడిన తపన, ఆయన ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, వికాస భారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు తడిసిన రాజశేఖర్‌రెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని తంగళ్లపల్లిలో మలిదశ తెలంగాణ ఉద్యమ జేఏసీ చైర్మన్ తడిసిన లింగారెడ్డి విగ్రహం వద్ద ఆయన 86 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వికాస భారతి సంస్థ తరఫున గ్రామ పారిశుధ్య కార్మికులకు, వాటర్ మెన్, లైన్ మెన్, ఆశాలు, ఏఎన్ఎం, కారోబర్‌లకు శాలువాలు కప్పి సత్కరించారు. అలాగే పదోతరగతిలో 9.8, 9.5, సాధించిన విద్యార్థులను సన్మానించి మెమోంటోలు అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాము నాగేశ్వరి శ్రీకాంత్, ఎంపీటీసీ శేఖర్, కుటుంబసభ్యులు తడిసిన శకుంతల, రాజశేఖర్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి కర్ణకంటి నరేష్, మాజీ సర్పంచ్ దినేష్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నారాయణరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణగౌడ్, రాజమౌళి, నర్సయ్య హరిదాస్, యాదయ్య, సంపత్, శేఖర్, ప్రకాష్, వెంకటేష్, నారాయణరెడ్డి, జోగు చందు, కిషన్‌చారి, నాగరాజు వెంకటేశ్వర్లు, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ తదితరులున్నారు.

దశాబ్ది వేడుకలకు తరలిన ఉద్యమకారులు



సికింద్రాబాద్ తరలివెళ్తున్న సిద్దిపేట జిల్లా ఉద్యమకారులు

జగదేవ్‌పూర్, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల వేడుకలకు సిద్దిపేట నుంచి ఉద్యమకారులు ఆదివారం తరలివెళ్లారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే వేడుకలకు రావాలని ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందడంతో జిల్లాకు చెందిన 60 మంది ఉద్యమకారులు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో జేఏసీ మాజీ చైర్మన్ పాపయ్య, మీడియా అకాడమీ మాజీ సభ్యుడు అంజయ్య, తెలంగాణ ఉద్యమకారులు పెద్దిరాజు, ప్రవీణ్, కృష్ణ, నర్సింగ్‌రావు, బాల్‌రాజు, కృష్ణ తదితరులున్నారు.

ఆత్మీయ సమ్మేళనం


బెజ్జంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989-90లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను సన్మానించారు.

- బెజ్జంకి


జగదేవ్‌పూర్ మండలంలోని మునిగడప జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒక ప్రైవేట్ రిసార్ట్‌లో నిర్వహించిన ఈ ఆత్మీయ సమ్మేళనంలో వారు ఉల్లాసంగా ఆడిపాడారు. గత జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు.

- జగదేవ్‌పూర్